మన సమగ్ర
ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
మంగళవారం, 08, సెప్టెంబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM

### స్పీకర్‌ను బెదిరించే హక్కు

# హరీశ్‌రావుకు ఎవరిచ్చారు?

**స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి మీరెవరని ప్రశ్నించిన శ్రీధర్ బాబు**
**స్పీకర్ పై దూషణలు వీడియో ఫుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని వెల్లడి**



**హైదరాబాద్ :**అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి, "ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు" అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు. స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు.మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభని కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి

# కాంగ్రెస్ పిలుపు


**- ఎర్రవల్లిలో భారీగా మోహరించిన పోలీసులు**



**సిద్దిపేట జిల్లా :**మర్కూక్ మండలం ఎర్రవల్లిలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌ను వెయ్యి డప్పులతో ముట్టడిస్తామని కాంగ్రెస్ నేత సతీశ్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫాంహౌస్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ముందస్తుగా పోలీసుల అదుపులోకి : మరోవైపు రైతుల సమస్యలపై నిరసనగా మర్కూక్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నేతలు రైతు దీక్షకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారులపై ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుం టున్నారు. అయినప్పటికీ కొంతమంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వద్దకు చేరుకున్నారు. మరోవైపు ముట్టడి పిలుపు నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణుల కదలికలపైనా పోలీసులు కీలకమైన నిఘా పెట్టారు.రెండు పార్టీల కార్యక్రమాలు : ఎర్రవల్లి ఫాంహౌస్ వైపు వెళ్లే మార్గాలను పోలీసులు పర్యవేక్షిస్తుండటంతో మర్కూక్ మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీల అరెస్ట్‌పై కేటీఆర్ ఫైర్..

# అది కోర్టు ధిక్కరణే!



**హైదరాబాద్ :**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిల అరెస్టును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కేటీఆర్) తీవ్రంగా ఖండిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజ కీయాలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తోందని ఆయన మండిపడ్డారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమా ర్‌పై చేసిన వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో ఈరోజు ఉదయం ఈ అరెస్టులు జరిగాయి.ఈ సందర్భంగా కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పం దిస్తూ.. ప్రజా ప్రతినిధులను శాసనసభకు వెళ్లకుండా ఆపవద్దని హైకోర్టు స్పష్టంగా ఆదేశించినా, ప్రభుత్వం వాటిని పెడచెవిన పెట్టిందని విమర్శించారు. అక్రమ కేసులు నమోదు చేస్తూ అరెస్టులకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి కోర్టుల పట్ల, చట్టం పట్ల ఉన్న అగౌరవాన్ని సూచిస్తోందని ధ్వజమెత్తారు. దాదాపు 1000 రోజుల పాలనలో ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. అక్రమ అరెస్టులు, అన్యాయమైన నిర్బంధాలలో మాత్రం విజయం సాధించిందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. "మీరు ఇచ్చిన 420 హామీలను ఇప్పుడైనా అమలు చేస్తే, మా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలందరం స్వచ్ఛందంగా అరెస్ట్ అవుతాం. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమా?" అని ఆయన సవాల్ విసిరారు.

# అన్నది నా తల్లిని నీ తల్లిని కాదు

- హరీశ్‌రావుపై స్పీకర్ ప్రసాద్ కుమార్ ఫైర్
- హరీశ్‌రావుపై ఆగ్రహం వ్యక్తం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్
- ఆవేశం తనకు ఉండాలని స్పీకర్ భావోద్వేగం
- మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారంటూ ఆవేదన



**హైదరాబాద్ :**మాజీ మంత్రి హరీశ్‌రావుపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లిపై చేసిన వ్యాఖ్యలకు హరీశ్‌రావు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. అన్నది తన తల్లినని, హరీశ్‌రావు తల్లిని కాదని వ్యాఖ్యానించారు. ఆవేశం తనకు ఉండాలని, బీఆర్ఎస్ నేతలకు కాదని హితవు పలికారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై జరిగిన దాడికి సంబంధించి నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.అంతకు ముందు మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేశంతో మాట్లాడారు. తమ ఎమ్మెల్యేలు సబిత, సునీతలపై జరిగిన దాడికి ఇంకా చర్యలు తీసుకోలేదని అన్నారు. ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసు పెట్టారని పేర్కొన్నారు. గౌరవ సభ కౌరవసభగా మారిందని మండిపడ్డారు. భావోద్వేగానికి గురైన స్పీకర్ : దీంతో స్పందించిన స్పీకర్ ప్రసాద్ కుమార్ మహిళా సభ్యులంటే సభతో పాటు తనకు కూడా గౌరవం అన్నారు. మీరు చెబితే నేను వినట్లేదా? తాను మాట్లాడుతుంటే మీకు ఎందుకంత ఆవేశమని హరీశ్‌రావును స్పీకర్ ప్రశ్నించారు. "మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు" అని భావోద్వేగానికి గురయ్యారు. సబితా ఇంద్రారెడ్డి, సునీత, కోవా లక్ష్మిపట్ల తనకు గౌరవం ఉందని స్పీకర్ అన్నారు. వారికి జరిగిన అసౌకర్యానికి నివేదిక కావాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపోర్టు రాగానే దానికి సంబంధించిన చర్యలు తీసుకుంటామని హరీశ్? రావుకు సమాధానం ఇచ్చారు.

### ఇద్దరం రాజీనామా చేసి

# ఉప ఎన్నికలకు వెళదాం

- ఉప ఎన్నికలో రేవంత్ డిపాజిట్ తెచ్చుకుంటే ముక్కు నేలకు రాస్తానన్న కౌశిక్ రెడ్డి
- అసెంబ్లీలో రేవంత్ వాడిన భాష అసహ్యకరంగా ఉందని విమర్శ
- కత్తులతో నరుకుతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని మండిపాటు




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "కొడంగల్ స్థానానికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలి. హుజూరాబాద్‌లో నేను కూడా రాజీనామా చేస్తా. మళ్లీ జరిగే ఉపఎన్నికలో రేవంత్ రెడ్డి డిపాజిట్ తెచ్చుకుంటే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తా" అని ఛాలెంజ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, శాసనసభ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగించిన భాష, పదజాలం అసహ్యకరంగా ఉన్నాయని, తెలంగాణ సమాజమంతా ఈ అభ్యంతరకర వైఖరిని గమనిస్తోందని మండిపడ్డారు.సభలో ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా సీఎం ఇష్టానుసారంగా మాట్లాడారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలోనే 'కత్తులతో నరుకుతాం' అని బహిరంగంగా బెదిరింపులకు దిగారని గుర్తు చేశారు. ఇవన్నీ పక్కనబెట్టి తమపై ఎథిక్స్ కమిటీ పేరుతో చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు.పార్టీ ఫిరాయింపుల అంశంపై కడియం శ్రీహరి చేస్తున్న విమర్శలకు కౌశిక్ రెడ్డి ఘాటుగా సమాధానమిచ్చారు. "కోట్లాది రూపాయల నిధులతో పాటు బీఆర్ఎస్ పార్టీ బీ-ఫారమ్‌పై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వ్యక్తి కడియం శ్రీహరి. డిప్యూటీ సీఎంగా, ఎమ్మెల్సీగా, ఎంపీగా పదవులు అనుభవించినప్పుడు ఆయనకు లేని నైతిక విలువలు ఇప్పుడు గుర్తుకొస్తున్నాయా?" అని నిలదీశారు. స్వార్థ రాజకీయం కోసం పార్టీని వీడిన నేతలు తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు.

### మహిళల ముందు హరీశ్ రావు

# బట్టలు విప్పుతారా?

- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి



**హైదరాబాద్ :** శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు."సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరం గా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహి ళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచ లన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతి నిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అసెంబ్లీ నుంచి కేసీఆర్ ఫాంహౌస్ కు బయల్దేరిన

# కేటీఆర్, హరీశ రావు.

- కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ ఎస్సీ విభాగం పిలుపు
- కాంగ్రెస్ వాహనాలపై బీఆర్ఎస్ కార్యకర్తల రాళ్ల దాడి



**హైదరాబాద్ :**శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల దుమారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద దాడులు, ప్రతిదాడులకు దారి తీసింది. ఓవైపు అసెంబ్లీలో ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే, తీవ్ర పరిణామాల సమాచారం అందు కున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీ సమావేశాల నుంచి నేరుగా ఎర్రవల్లి ఫాంహౌస్‌కు బయల్దేరారు. స్పీకర్ వివాదం, సభలో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ప్రజాప్రతినిధులపై పోలీసుల ప్రవర్తన, అభ్యంతరకర భాషపై తదుపరి కార్యాచరణను అధినేత కేసీఆర్‌తో చర్చించి ఆయన దిశానిర్దేశం తీసుకోనున్నారు. మరోవైపు, స్పీకర్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి పిలుపునిస్తూ వెయ్యి డప్పులతో బయల్దేరడంతో పరిస్థితి దారితప్పింది. మర్కుక్ మండలం దామరకుంట వద్ద ఫాంహౌస్ వైపు వస్తున్న కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకోవడంతో తీవ్ర ఘర్షణ చెలరేగింది. కాంగ్రెస్ నేతల వాహనాలపై బీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్ల దాడికి పాల్పడటంతో ఇరువర్గాలు రోడ్డుపైనే తీవ్ర తోపులాటకు దిగాయి. పరిస్థితి తీవ్రం కావడంతో పోలీసులు రంగంలోకి దిగి ఫాంహౌస్ పరిసర ప్రాంతాలలో ముందస్తుగా 144 సెక్షన్ విధించారు. వెంకటాపూర్, ఎర్రవల్లి శివారు దారుల్లో భారీ బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నిరసనకారులు ఫాంహౌస్ దరిదాపుల్లోకి రాకుండా పహారా పెంచి, వందలాది మంది పోలీసులతో బందోబస్తును కట్టుదిట్టం చేశారు.

# మట్టి గణపతే మేలుబాట.. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల బాట!

**●ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు గుడ్‌బై.. మట్టి వినాయకుడి పూజకు సుజాత విద్యానికేతన్ పిలుపు**








**హసన్‌పర్తి,రిపోర్టర్ ప్రణయ్ గొర్రె,సెప్టెంబర్ 8:**
“మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం” అనే నినాదంతో సుజాత విద్యానికేతన్ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. 66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో మంగళవారం మట్టి వినాయకుడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మట్టి వినాయక ప్రతిజ్ఞ చేయించారు.

**కాలుష్యానికి చెక్.. మట్టి గణపతికి స్వాగతం**
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ మాట్లాడుతూ వినాయక నవరాత్రి వేడుకలు భక్తి, ఆనందాలకు ప్రతీకలని అన్నారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి వనరులు కలుషితమై జలచరాలు, పశు పక్షాదులు, మానవాళికి హాని కలుగుతోందని తెలిపారు. మట్టి గణపతి ఆరాధన సనాతన ధర్మానికి, ప్రకృతి పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మట్టి వినాయకుడిని పూజించడం కేవలం సంప్రదాయం మాత్రమే కాదని, భూమాత పట్ల మనకున్న కృతజ్ఞతను చాటే గొప్ప బాధ్యత అని అన్నారు. 30 ఏళ్లుగా పర్యావరణహిత కార్యక్రమాలు

సుజాత విద్యానికేతన్ పర్యావరణహిత పాఠశాలగా గత 30 ఏళ్లుగా మట్టి వినాయకులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థుల చేత తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

ఇప్పటివరకు సుమారు 35 వేలకుపైగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కరపత్రాల పంపిణీ, ర్యాలీల ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. “ఇంటింటా మట్టి గణపతి.. ప్రతి మనసులో పర్యావరణ స్పృహ”విద్యార్థులు తమ ఇళ్లలో మట్టి వినాయక విగ్రహాలను పూజించి ప్రకృతి సంరక్షణలో భాగస్వావులు కావాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు “మట్టి వినాయకుడు--పర్యావరణానికి రక్షకుడు”, “పర్యావరణాన్ని కాపాడుదాం--మట్టి వినాయకుడిని పూజిద్దాం” అంటూ ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. ప్రకృతి రక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తూ, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఏ. వెంకట్, రాధాకుమారి, మానస, అరుణ, గీత, జి. సంధ్య, సిహెచ్. సంధ్య, దేవిక, స్వప్న, సరిత, ప్రవళిక, లావణ్య, దివ్యరాణి, సుచిత్ర, స్వాతి పాల్గొన్నారు

# ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలి

**- గ్రామ సర్పంచ్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు సత్యనారాయణ**
**- నర్సాయపల్లిలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం**






**మద్దూరు సెప్టెంబర్ 8, ప్రజా వాణి,**
మాస్ వెల్ఫేర్ మినిస్ట్రీస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మండలంలోని షాలేము ప్రార్థన మందిరం నరసాయపల్లి గ్రామ సర్పంచ్ మండల ఫోరం అధ్యక్షుడు శనిగరం సత్యనారాయణ,సంఘ సేవకులు అందె విజయ్ కుమార్ మరియు చేర్యాల మండల బి ఆర్ఎస్ మండల మాజీ సెక్రటరీ కోతిదాసు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని వర్గాల మహిళలు ఈ ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ఉపయోగించుకొని తమ కాళ్ళపై నిలబడి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ కిరణ్, నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పాస్టర్ సామ్యూల్, బ్రదర్ కుమార్, జాన్ వెస్లీ, ప్రభాకర్, మోజస్, పలువురు గ్రామస్తులు,మహిళలు పాల్గొన్నారు.

# ఖనిజ లీజుల్లో పారదర్శకతకు పెద్దపీట


**ఈ-వేలం ద్వారానే కేటాయింపులు..**
**రెవెన్యూ ఆదాయం పెంపుపై ప్రత్యేక దృష్టి**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ప్రజావాణిమెదక్, జిల్లా బ్యూరోసెప్టెంబర్ 7:**
అధికారులకు ఆదేశంఖనిజాల లీజుల ద్వారా ప్రభుత్వ రెవెన్యూ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఖనిజ వనరుల వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రధాన ఖనిజాలన్నీ ఈ-వేలం ద్వారానే.. సున్నపురాయి, మాంగనీస్, ఇనుప ఖనిజం, లిథియం తదితర ప్రధాన ఖనిజాల లీజులను కేవలం వేలం ద్వారానే కేటాయించే విధంగా భారత ప్రభుత్వం 2015లో ఎంఎండీఆర్ చట్టాన్ని సవరించిందని కలెక్టర్ తెలిపారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా జి.ఓ.ఎం.ఎస్. నెం.26, తేదీ 31.03.2022 ద్వారా ముడి రాయి, రోడ్డు మెటల్, భవన నిర్మాణ రాయి, డోలమైట్ తదితర చిన్న ఖనిజాల క్వారీ లీజులను వేలం ఆధారంగా మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేస్తూ తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్, 1966ను సవరించిందని వివరించారు. ఆదాయ వనరులపై నిరంతర పర్యవేక్షణ. ప్రభుత్వానికి రెవెన్యూ ఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఖనిజ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు వేలం విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఒకే డిజిటల్ పోర్టల్ ద్వారా పర్యవేక్షణ.. ఖనిజ బ్లాకుల గుర్తింపు, వేలం ప్రక్రియ, అవసరమైన క్లియరెన్స్‌ల పర్యవేక్షణ వంటి ప్రక్రియలన్నీ ఒకే డిజిటల్ పోర్టల్ ద్వారా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రధాన ఖనిజాల లీజుల కేటాయింపును మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం కేవలం ఈ-వేలం ద్వారానే కేటాయింపులు చేపట్టాలని స్పష్టం చేసిందన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి రెవెన్యూ, మైనింగ్, భూముల కొలతలు, ఇరిగేషన్ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడి మైన్స్ నాగరాజు, ఏడి ల్యాండ్ సర్వే కిషన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ రంజిత్ కుమార్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

**వినాయకుడు విగ్రహాలు అమ్మబడును**
**వినాయకుడి విగ్రహాల కొనుగోలు కోసం ఆసక్తి ఉన్నవారు సంప్రదించవచ్చు**
**బాలాజీ 9885940101**





**(ప్రజావాణి) సెప్టెంబర్ 8 ప్రతినిధి మునిపల్లి నరేష్ యాదవ్.**
కూకట్పల్లి విలేజ్ : బిజెపి ఆఫీస్ రోడ్డు, ఆనంద్ రావు హాస్పటల్ , పక్కన బాలాజీ అన్ని రకాల వినాయకుడు విగ్రహాలను విక్రయిస్తుంది. వినాయకుడి విగ్రహాల విభిన్న నమూనాలను అందుబాటులో ఉంచి, వినియోగదారులకు అందించడం జరుగుతుంది. విభిన్న మెటీరియల్స్ లో తయారైన విగ్రహాలు, వివిధ పరిమాణాలలో అందుబాటులో ఉన్నాయి. కూకట్పల్లి ప్రాంతంలోని ప్రజలకు వినాయకుడి విగ్రహాల కొనుగోలుకు మంచి అవకాశం కల్పిస్తుంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి పోటెత్తుతున్న కాంగ్రెస్ శ్రేణులు

**బెజ్జంకి, సెప్టెంబర్ 8 (ప్రజావాణి)** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డప్పులతో నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో బయలుదేరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్‌ను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వారు పేర్కొన్నారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చేర్మెన్ పులికృష్ణ, ముక్కిస రత్నాకర్ రెడ్డి, జేల్లా ప్రభాకర్, రావుల నర్సయ్య పాల్గొన్నారు.





# మక్తగూడెంలో మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం




**మక్తగూడెం, సెప్టెంబర్ 08: మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
మక్తగూడెం గ్రామానికి చెందిన కొడూరి మల్లయ్య అకాల మరణం పట్ల గ్రామ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ తరఫున ?5,000 ఆర్థిక సహాయాన్ని 10వ వార్డు మెంబర్ విష్ణు చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్, వొగ్గు దేవయ్యతో పాటు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొని మల్లయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని వారు ప్రార్థించారు.

# సొంతింటి కలకు కాంగ్రెస్ భరోసా

**లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ ఫారాలు అందజేత**



**డోర్నకల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 8, ప్రజావాణి :**
పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా కురవి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నలుగురు లబ్ధిదారులకుమండల సీతమ్మ, మండల ఉపేంద్ర, మండల సరిత, నెరుసుల నాగలక్ష్మిలకు ప్రొసీడింగ్ ఫారాలు అందించారు. కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు రాజేందర్ నారాయణ కుమార్, మంగళవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు .డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురవి ఉప సర్పంచ్ ఎర్ర నాగేశ్వరరావు, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేష్ వేద, ఇందిరమ్మ కమిటీ సభ్యురాలు తరాల కళావతి, మాజీ వార్డు సభ్యుడు బానోత్ లక్ష్మణ్ నాయక్, బి. యల్. ఎ, సంగెం నాగరాజు, తరాల వీరన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బత్తిని సత్తయ్య, బుక్క నాగరాజు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com